క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: కృష్ణంపాలెంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేస్తున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్టు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణంపాలెం, యర్నగూడెం, సంగాయగూడెం, ధుమంతునిగూడెం, పల్లంట్ల ఫీడర్లపై ఉన్న గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా ఇస్తామని తెలిపారు.

బాధితులకు 'మానవత' సాయం



బాలుడికి మూడు చక్రాల కుర్చీ అందిస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: ముసుళ్లగుంట గ్రామానికి చెందిన గడాని వెసిలియ్య (10) పుట్టుకతోనే వికలాంగుడు. రెండు కాళ్లు పని చేయక పోవడంతో బడికి కూడ వెళ్లే పరిస్థితి లేదు. అతడికి మానవత సంస్థ రూ.6,300 విలువైన మూడు చక్రాల కుర్చీని ఆదివారం అందజేసింది. ఆ సంస్థకు ఆ బాలుడి తండ్రి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. అదే గ్రామంలో కేన్సర్‌తో బాధ పడుతున్న చిరుంగుల వెంకట సుబ్బారావుకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమాల్లో కండెపు వెంకట సూర్యనారాయణ, గ్రామ పెద్దలు నందమూరి రామకృష్ణ, బలుసు గంగరాజు, వెల్లి సుబ్బారావు, మానవత సభ్యులు గుత్తికొండ వరప్రసాద్, గుళ్ళపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, దావులూరి చిరంజీవి, ఐడీవీ అప్పారావు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు

నిడదవోలు: రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా రానున్న వేసవిలో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఈ.శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పట్టణంలో ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ ఉప కేంద్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పట్టణంలో విద్యుత్ ఉప కేంద్రాల్లో రెండో 100 ఎంవీఎంపీటీఆర్‌ను 160 ఎంవీఎం పీటీఆర్‌గా సామర్థ్యం పెంచి మార్పు చేస్తామన్నారు. ఈ పనులు సుమారు 50 రోజులు సమయం పడుతుందన్నారు. ఈ సమయంలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా, ఎక్కడా సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఈఈ పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి, హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై కె.వీరబాబు అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని సమిశ్రగూడెం వంతెన వద్ద వాహనదారులకు 'హెల్మెట్ ధరించండి-సురక్షితంగా ఇంటికి చేరండి' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎస్సై వీరబాబు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగాధరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి యూరియా సిద్ధం



యర్నగూడెం సొసైటీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న యూరియా

దేవరపల్లి: వరి రైతులకు అవసరమైన యూరియా ఎరువు యర్నగూడెం సొసైటీలో పంపిణీకి సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి కె.విజయ్ తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 1,620 ఎకరాల్లో దాళ్వా వరి పంట వేసినట్టు ఆయన తెలిపారు. ఎకరాకు మూడు బస్తాల (150 కిలోలు) యూరియా మాత్రమే వాడాలని, దీని ప్రకారం 243 మెట్రిక్ టన్నుల ఎరువు రైతులకు సరఫరా చేయాల్సి ఉందని వివరించారు. అయితే, ఎకరాకు 5 బస్తాల (250 కిలోలు) యూరియాను రైతులు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ రైతులకు 320 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం సొసైటీ వద్ద 45 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు.

అభివృద్ధి పనులకు రూ.43 లక్షల మంజూరు

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలో అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నుంచి రూ.43 లక్షలు మంజూరైనట్టు జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గా శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ నిధులతో బ్రాహ్మణగూడెంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో ముందుగానే పనులకు పరిపాలన ఉత్తర్వులు మంజూరు కావడంతో వెంటనే పనుల నిర్మాణాన్ని చేపట్టామని ఆమె చెప్పారు.

గుంతలు పూడ్చటం ఎప్పటికయ్యేనో!



పెరవలి వద్ద నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో గుంతలు పూడుస్తున్న దృశ్యం

పెరవలి: పండగకి ఊర్లు వెళ్లి వచ్చి ఎక్కడైనా రోడ్లు బాగోలేదని ఎవరైనా అంటే అందుకు ఆ ఎమ్మెల్యేలదే బాధ్యత అని నొక్కిచెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు, పెరవలి మండలంలో రోడ్లకు నేటికీ గుంతలు పూడ్చడం అవ్వలేదు. నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన గోతులు కాదు నూతులు పూడ్చడం నేటికీ పూర్తి కాలేదు. పెరవలి నుంచి కానూరు 10 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి పనులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డులో ఏర్పడిన గుంతలు పూడ్చడం కొనసాగుతూ ఉండటంతో వాహనదారులు, బాటసారులు, సైక్లిస్టులు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అంతేకాకుండా గుంతలు పూడ్చటం మొదలు పెట్టి నేటికి రెండు నెలలు అవుతుంటే ఇక రోడ్డు నిర్మాణం ఎప్పటికి చేపడతారో తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికే రోడ్డును తవ్వేయటం వలన రాళ్లు లేచిపోయి చాలా ఇబ్బందిగా ఉందని వాహనాలు వచ్చేటప్పుడు రాళ్లు లేచి పక్కనే వెళుతున్న వాహనాలు, ద్విచక్ర వాహనాలపై పడటంతో గాయాలపాలవుతున్నారని దీనంగా చెబుతున్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ, ఏసీ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. కోటసత్తెమ్మను తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకంతో రూ.1,40,977 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులు



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న పూర్వ విద్యార్థులు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో గల బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో 2002–05 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. సుమారు 40 మొక్కలు నాటిన విద్యార్థులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం నివారణకు మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. దూర ప్రాంతాల్లోని పూర్వ విద్యార్థులు కూడా ఈ రోజు వారి ఇళ్ల వద్ద మొక్కలు నాటినట్టు వారు తెలిపారు. పర్యావరణ పరిరక్షకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. హైస్కూల్‌లో పదో తరగతి చదివిన ప్రతి విద్యార్థి పాఠశాలలో మొక్కనాటి వెళ్లాలని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి ప్రసాద్, బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రొక్కం శ్రీను, కోరం ఆంజనేయులు, దుర్గారావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వించేలా విద్యార్థులు ఎదగాలి



దూబచర్లలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు



అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

నల్లజర్ల సీఐ శ్రీనివాసరావు

నల్లజర్ల: తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నల్లజర్ల సీఐ యస్.శ్రీనివాసరావు అన్నారు. దూబచర్లలో ఆదివారం ఎలైట్ కళాశాల ఫెస్ట్‌లో ప్రిన్సిపాల్ కె.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విభిన్న ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. బాల్యం నుంచే విభిన్నంగా ఆలోచించే అలవాటు పెంచుకోవాలని సూచించారు. జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారో దాన్ని పొందే వరకు విశ్రమించకుండా కృషి చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజరు(మచిలీపట్టణం)యం.వీరదాసు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతి ఆలోచనలో పవిత్రత ఉండాలని భ్రమలు వీడి వాస్తవంలో ఉంటేనే విజయాలు సాధిస్తారన్నారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపాలన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దావులూరి ప్రభాకర్రావు, డైరెక్టర్లు సుదర్శనం, సుబ్బారావు, సోమశేఖరం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రూ.2 వేల ప్రీమియంతో రూ.40 లక్షల ప్రమాదబీమా



ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఇస్లావతు లాలునాయక్

నిడదవోలు: ఎస్‌బీఐ నూతనంగా ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకంలో ఏడాదికి రూ.2 వేల ప్రీమియం చెల్లిస్తే రూ.40 లక్షల ప్రమాద బీమాను కల్పిస్తుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) నిడదవోలు శాఖ చీఫ్ మేనేజర్ ఇస్లావతు లాలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తు గురించి ప్రతి ఒక్కరూ ఎన్నో ప్రణాళికలు వేసుకుంటారు. కుటుంబం, పిల్లల భవిష్యత్ కోసం పలు లక్ష్యాలు పెట్టుకుని పని చేస్తుంటారు. అలాంటివారు ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబానికి అండగా ఎస్‌బీఐ కొత్తగా వ్యక్తిగత ప్రమాద బీమా కల్పిస్తోందన్నారు. ఎస్‌బీఐ సరికొత్త బీమా పథకాల్లో భాగంగా పలు రకాల ఇన్సూరెన్స్ పాలసీలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. వీటిలో రూ.100 నుంచి రూ. 2000 రూపాయల వరకు బీమా పాలసీలు ఉన్నాయన్నారు. వ్యక్తిగత ప్రమాద బీమా పథకంలో పలు రకాల శ్లాబులు ఉన్నాయన్నారు. ఏడాదికి రూ.100 రూపాయలు చెల్లించి బీమా చేయించుకున్నావారు ప్రమాదవశాత్తూ మరణిస్తే నామినీకి రూ.2 లక్షల బ్యాంకు అందిస్తుందన్నారు. ఏడాదికి రూ.200 పాలసీ తీసుకుంటే రూ.4 లక్షలు, ఏడాదికి రూ.500 పాలసీకి రూ.పది లక్షల ప్రమాద బీమా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.1000 పాలసీ తీసుకుంటే రూ.20 లక్షల ప్రమాదబీమా వస్తుందన్నారు. రూ.1000 పాలసీని తాజాగా విస్తరించి రూ.2 వేలకు పెంచిందన్నారు. ఈ పాలసీ ద్వారా ప్రమాదవశాత్తూ మరణిస్తే నామినికి రూ.40 లక్షలు చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ప్రమాదబీమాకు ఎవరు అర్హులు

ఎస్‌బీఐ కొత్తగా తీసుకువచ్చిన ప్రమాద బీమా పథకంలో ప్రమాదాల్లో మృతి చెందిన వారికి మాత్రమే వర్తిస్తోందన్నారు. సహజ మరణాలకు, ఆరోగ్య మరణాలకు ఈ పథకం వర్తించదన్నారు. రోడ్డు ప్రమాదాలు, కరెంట్‌షాక్, వరదలు, భూకంపాలు, పాము, తేలు కాటు ద్వారా సంభవించే ప్రమాద మరణాలకు మాత్రమే బీమా వర్తిస్తుందన్నారు. ఈ ప్రమాద బీమాలో చేరడానికి 18 నుంచి 70 ఏళ్ల వయసున్న వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఎస్‌బీఐ ప్రమాద బీమా చేసుకున్న వారు మరణించిన 90 రోజుల్లోపు వివరాలను నామినీ తెలియజేయాలి. ఘటన జరిగిన 180 రోజుల్లోపు సంబంధిత పత్రాలన్నీ సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ పాలసీదారు ఈ పాలసీని రద్దు చేసుకోవాలని భావిస్తే రాతపూర్వక నోటీసు ఇవ్వాలన్నారు. 15 రోజుల్లో పాలసీని రద్దు చేస్తామన్నారు. బీమా చేయించాలనుకున్న వారు ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయాలల్లో సిబ్బంది వివరాలు తెలియజేస్తారని, లేదంటే ఆన్‌లైన్‌లో యోనో యాప్ ద్వారా ఈజీగా పాలసీ తీసుకోవచ్చన్నారు. ఎస్‌బీఐ ఖాతాదారుకు మాత్రమే ఈ అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

7న సాయిబాబా ఆలయం ప్రారంభం

తాళ్లపూడి: బల్లిపాడులో నూతనంగా నిర్మించిన శిర్డీ సాయిబాబా ఆలయం ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యింది. సుమారు రూ.కోటి వ్యయంతో సాయి భక్తులు వి.శ్రీనివాస రమణ స్థలం, ఆర్థిక సాయంతో సాయిరామ నిత్యలేఖన సమితి ఆధ్వర్యంలో ఆలయాన్ని, జ్ఞాన మందిరాన్ని నిర్మించారు. 5, 6, 7వ తేదీల్లో ఆలయ ప్రతిష్ఠాపన చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 7న విగ్రహ ప్రతిష్ఠ, అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన

నిడదవోలు: స్థానిక చర్ల సుశీల వృద్ధాశ్రమంలో సుంకవల్లి వెంకన్న చౌదరి మాతృమూర్తి మంగరాజు నాల్గవ వర్ధంతి సందర్భంగా ఆదివారం 100 మంది వృద్ధులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో తమ్మిరెడ్డి త్రిమూర్తులు, విజయ్‌కుమార్, చర్ల విదులకుమారి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు



కాపవరంలో ముమ్మరంగా నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు

పెరవలి: అంగన్‌వాడీ కేంద్రాల వద్ద భూగర్భ జలాలను వృద్ధి చేయటానికి ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. మండలంలోని 39 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వీటిని నిర్మించడానికి పనులు చేపట్టారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.14 వేలు చొప్పున 6 ఇన్‌టు 6 సైజులో వీటిని నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణ తెలిపారు. ఈ నిర్మాణాలను ఉపాధిహామీ పథకంలో చేపట్టినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే గుంతలు తవ్వడం పూర్తయిందని, ప్రస్తుతం ఇటుకలతో గోడలు నిర్మించి అందులో చిన్న చిప్స్, పెద్ద రాళ్లను వేస్తున్నామని దీని వలన భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో సొంత భవనాలు కలిగి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వీటి నిర్మాణాలు చేపట్టినట్లు ఆయన వివరించారు.

రెండో పంటకు నీరందించారు



సింగరాజుపాలెం వద్ద పోలవరం కుడి కాలువలో నీరు

సాక్షి ఇంపాక్ట్

నల్లజర్ల: 'రెండో పంటకు నీరందించండి మహాప్రభో' శీర్షికన గత నెల 16న సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. పట్టిసీమ లిఫ్ట్ ద్వారా రెండో పంటకు నీరందించి ఆదుకోవాలన్న సింగరాజుపాలెం రైతుల గోడును 'సాక్షి' ఆ కథనంలో వివరించింది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు ఎట్టకేలకు స్పందించి, పోలవరం కుడి కాలువకు నీరు విడుదల చేశారు. ఈ కాలువ నిర్మాణానికి ఇక్కడి రైతులు ఎంతో విలువైన తమ భూములను తక్కువ ధరకే ప్రభుత్వానికి అందించి త్యాగం చేశారని ఎంపీటీసీ సభ్యుడు వామిశెట్టి పావనీకుమారి చెప్పారు. రెండో పంటకు నీరందించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకెళ్లామని రైతులు వామిశెట్టి పరమేశ్వరావు, బుద్దాల వెంకటేశ్వరావు తదితరులు వివరించారు. ప్రతి ఏటా రెండో పంటగా మొక్కజొన్న వేసి, పోలవరం కాలువ నీటిని మోటార్ల ద్వారా తోడుకుని గట్టెక్కించుకునే వారమని చెప్పారు. ఈ ఏడాది గొల్లగూడెం లిఫ్ట్ ద్వారా ఈ కాలువలోని జలాలను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు తమ ప్రాంతానికి తరలించుకుని పోయారని, దీంతో నల్లజర్ల మండలంలోని అచ్చన్నపాలెం, ఆవపాడు, సింగరాజుపాలెం, మారెళ్ళమూడి, గొల్లగూడెం గ్రామాల్లోని రైతులకు రెండో పంటకు నీరందకుండా పోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే మద్దిపాటి సంబంధిత అధికారులతో మాట్లాడి, పట్టిసీమ లిఫ్ట్ ద్వారా రెండో పంటకు నీరు విడుదల చేయించారని ఎంపీటీసీ పావనీ కుమారి, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



గోపాలపురంలో పాదయాత్ర చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్

గోపాలపురం: కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసిందని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మడం లేదని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ అన్నారు. ఏలూరు నుంచి కాకినాడ వరకూ నిరుద్యోగుల కోసం చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారం ఏడో రోజు గోపాలపురం చేరుకున్నారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, సీపీఎస్ రద్దు, వలంటీర్ వ్యవస్థ పునరుద్ధరణ, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్లకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చి వాళ్లకు హెల్త్ కార్డులతో పాటు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చాక ఒక్కటీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. మీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఓటు వేసి గెలిపించాలని దుర్గాప్రసాద్ ప్రచారం చేశారు.

చిన్నారుల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకే బాలవికాసం



ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠంలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

ఉండ్రాజవరం: చిన్నారులకు చదువులతో పాటు వారిలోని సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికి తీసేందుకు బాల వికాసం ఎంతగానో ఉపయోగపడుతుందని బౌద్ధధమ్మ పీఠం పీఠాధిపతి భంతె అనాలియో అన్నారు. ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠంలో ఆదివారం చిన్నారి బాల బాలికల్లో వికాసం కల్పించేందుకు బాల వికాసం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈకార్యక్రమంలో 13 సంవత్సరాల లోపు విద్యార్థులకు నీతి సూత్రాలతో పాటు, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యానం తదితర అంశాలపై తర్ఫీదు ఇస్తారన్నారు. ఆయా కోర్సులకు సంబంధించి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బోధించడానికి ముందుకు వచ్చారన్నారు. అనంతరం చిన్నారులతో అనాలియో చెడు పనులు, చెడు ఆలోచనలు, దుర్వ్యసనాలు, చెడు మాటలు, ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులు చేయం, ఆనందించం అని ప్రతిజ్ఞ చేయించారు. నేటి నుంచి ప్రతి ఆదివారం చిన్నారులకు ఆటవిడుపుగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అశ్వరథంపై సూర్యభగవానుడు



సూర్యభగవానుడి ఉత్సవమూర్తులను అశ్వరథంపై ఊరేగిస్తున్న భక్తులు

కొవ్వూరు: ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయంలో నిర్వహిస్తున్న సౌర యాగంలో నాలుగో రోజు ఆదివారం సూర్యభగవానుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించిన అశ్వరథంపై ఊరేగించారు. ముందుగా సూర్య ఉపాసకులు విక్రమాదిత్య నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉషా సొజ్ఞ సమేత సూర్యనారాయణుడి ప్రత్యేక రథంలో పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. శివాలయం నిర్వాహకులు అనపర్తి శివరామకృష్ణ, మద్దుకూరి వెంకటేశ్వరరావు, బండి సురేష్‌లతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుందరేశ్వరస్వామి ఆలయంలో..

సూర్య భగవానుడిని ఆరాధించడం ద్వారా భక్తులకు రోగబాధల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల నమ్మకమని సుందరేశ్వరస్వామి ఆలయ అర్చకులు మానేపల్లి సుందర గణేష్ శాస్త్రీ తెలిపారు. ఆదివారం మాఘమాసం మొదటి ఆదివారం కావడంతో సుందరేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఉపాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సూర్య అష్టోత్తరం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 4న రథ సప్తమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర బడ్జెట్



విలేకరులతో మాట్లాడుతున్న నాగేంద్ర, నాయకులు

కొవ్వూరు: దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టారని జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. పట్టణంలో ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సమాగ్రాభివృద్ధి, వ్యవసాయం, రవాణ, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్యం తదితర రంగాలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు. మధ్య, ఎగువ మధ్య తరగతి ప్రజల వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఇన్‌కం టాక్స్ మినహాయింపు ఇవ్వడం హర్షించ దగిన విషయం అన్నారు. ప్రారిశ్రామిక, టెక్నాలజీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట చేసిందన్నారు. మెకిన్ ఇండియా లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారన్నారు. రాష్ట్రంలో పోలవరం, విశాఖ పట్నం స్టీలు ప్లాంటుకి రూ.11,400 కోట్లు కేటాయించడం, విశాఖ రైల్వే జోన్, అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సాను కూలంగా ఉందని తెలిపారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సలాది సందీప్ కుమార్, నియోజకవర్గ కన్వీనర్ మాట్లా వీరాంజనేయులు, పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి



మృతుడు వీరమల్లు అన్నవరం

గోపాలపురం: చెట్టును ఢీకొని మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఎస్సై కర్రి సతీష్‌కుమార్ కథనం ప్రకారం.. గోపాలపురం మండలం వెంకటాయపాలేనికి చెందిన వీరమల్లు అన్నవరం (40) ఉదయం తన పంట పొలానికి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చే సమయంలో ఆ గ్రామ శివారులోని రోడ్డు మలుపులో చెట్టును మోటార్ సైకిల్‌తో బలంగా ఢీకొన్నాడు. అతని తలకు బలమైన గాయం కావడంతో గోపాలపురం సామాజిక ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

తలారి వెంకట్రావు పరామర్శ



తాడిపూడిలో నామా శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

తాళ్లపూడి: పితృవియోగంతో బాధపడుతున్న తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్‌ను తాడిపూడిలో ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. శ్రీనివాస్ తండ్రి నామా కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన చిత్రపటం వద్ద తలారి నివాళులు అర్పించారు. తలారీ వెంట వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం నాయకుడు కంఠమని రమేష్, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, వి.నంద, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీ ఇవ్వడంపై హర్షం



చీపురుగూడెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లజర్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ఇవ్వడంపై ఆ వర్గం వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి చీపురుగూడెం జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మోదుగ సుబ్బారావు, వసంతాడ ఆనంద్ స్వరూప్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. మాదిగ పోరాట రక్షణ సమితి అధ్యక్షుడు కండెల్లి శేఖర్ మాట్లాడుతూ సామాజిక సమస్యలపై పోరాటాలు చేసిన ఉద్యమ నాయకుడికి పద్మశ్రీ రావడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు గేర శ్రీను, బయ్యారపు రాజేశ్వరావు, మోదుగ బుజ్జి, వసంతాడ శ్రీను, చిరంజీవి, వెంకట్రావు, జగదీష్, నాగేశ్వరావు, జాను, చిన్నారావు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు: గోష్పాద క్షేత్రంలోని సుందర సాయినాథ్ ఆధ్యాత్మిక కేంద్రం 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం సాయి సచ్చరిత పారాయణం, లింగాల శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో గణపతి హోమం, గణపతి మహా యాగం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణ, సాయంత్రం కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈనెల నాలుగో తేదీ వరకు ఈ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 3న బాబాకి ఏకాదశ రుద్రా భిషేకాలు, మధ్యాహ్నం సంపూర్ణ భగవద్గీత పారాయణం, సాయంత్రం భక్తి సంగీత విభావరీ, 4న సామూహిక విష్ణు సహస్ర పారాయణ, సంకీర్తన, ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.